క్లుప్తంగా

దళిత కాలనీల్లో అభివృద్ధిని ఆపితే ఊరుకోం

అగ్రహారం కాలనీవాసుల ఆందోళన



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

పిఠాపురం: దళిత కాలనీల్లో అభివృద్ధిని ఆపితే ఊరుకోబోమంటూ పిఠాపురం అగ్రహారం కాలనీవాసులు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత కాలనీల్లో అభివృద్ధిని ఉద్దేశపూర్వకంగా అధికారులు అడ్డుకుంటున్నారని కాలనీ నాయకులు బత్తిన రాజశేఖర్, వజ్రపు వీరేష్ తదితరులు ఆరోపించారు. అగ్రహారం కాలనీలో మూతపడిన కబేళాను తెరిచేందుకు అధికారులు యత్నిస్తున్నారని, కాలనీవాసులను ఇబ్బందులకు గురి చేసే కబేళాను తెరిస్తే సహించేది లేదన్నారు. కబేళాను వేరేచోటికి తరలించాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.30 కోట్లతో 1, 30 వార్డుల్లో పలు అభివృద్ధి పనులు చేసేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినప్పటికీ, ఇప్పటివరకు అధికారులు టెండర్లకు పిలవకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయా పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి కాలనీవాసులు వినతిపత్రం అందించారు. జూన్ 15లోపు టెండర్లు పిలుస్తామని, కబేళా విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని కమిషనర్ ఎస్.కనకరావు తెలిపారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం మఖ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. బంగారు, వెండి పుష్పాలతో పాటు, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి గ్రీవెన్స్

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఏడు అర్జీలు అందినట్లు ఆమె చెప్పారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, హౌసింగ్ అధికారి రవిశంకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోదావరి గట్టు పరిశీలన



గోదావరి కాలువ గట్టును పరిశీలిస్తున్న వీఆర్వో, కౌన్సిలర్

సామర్లకోట: పట్టణంలోని మాండవ్య నారాయణస్వామి ఆలయం వద్ద ఉన్న గోదావరి కాలువ గట్టు స్థితిగతులను వీఆర్వో నూతలపాటి లోవరాజు సోమవారం పరిశీలించారు. గోదావరి కాలువ గట్టు తవ్వేశారని, ఈ సమయంలో తమకు చెట్టు-పట్టా పథకంలో ఇచ్చిన కొబ్బరి చెట్లు నరికివేశారంటూ తహసీల్దార్ కార్యాలయంలో ఫీల్డు లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ గౌరవాధ్యక్షుడు, కౌన్సిలర్ నేతల హరిబాబు డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. డిప్యూటీ తహసీల్దార్ ఆదేశాల మేరకు వీఆర్వో గోదావరి కాలువ గట్టును పరిశీలించారు. కాలువ గట్టును తవ్వి, చెట్లను నరికి వేసినట్లు గమనించారు. ఈ మేరకు వాస్తవ పరిస్థితిని డిప్యూటీ తహసీల్దార్‌కు వివరించి, దీనిపై ఇరిగేషన్ అధికారుల సమక్షంలో సర్వే చేయాల్సి ఉందని తెలిపారు. దాంతో ఇరిగేషన్ అధికారులకు డిప్యూటీ తహసీల్దార్ సమాచారం అందించారు.

నేడు కుమార షష్ఠి



పంచారామ క్షేత్రంలోని కుమారస్వామి

సామర్లకోట: కుమార షష్ఠి సందర్భంగా స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన కుమార స్వామి ఆలయంలో మంగళవారం కుమార షష్ఠి వేడుకలు జరుగుతాయని ఈఓ బళ్ల నీలకంఠం సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, పట్టు వస్త్రాలతో అలంకరణ, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఈఓ కోరారు. అలాగే ఆలయంలో ఉన్న మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయంలో దుర్గాష్టమి సందర్భంగా గురువారం అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరుగుతాయని చెప్పారు.

తగ్గేదేలే..!

- వివాదాస్పదంగా మారిన కమిషనర్ తీరు
- టేబుల్ అజెండాపై మండిపడిన పాలకవర్గం
- మళ్లీ దానినే చైర్‌పర్సన్‌కు పంపిన వైనం
- గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశానికి కొర్రీ



కమిషనర్ తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు (ఫైల్)

పిఠాపురం: పాలక వర్గంతో పని లేదు, కూటమి నేతలు చెప్పిందే చేస్తామనే ధోరణిలో ఉంది గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ తీరు. కూటమి నేతలు పనులు నిర్దేశిస్తే.. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సభ్యులం మేమెందుకు అంటూ పలువురు కౌన్సిలర్లు అధికారుల తీరును దుయ్యబడుతున్నారు. మీరు అధికారంలో ఉంటే మాకేంటి? అధికార పార్టీ నేతలు సూచించిన పనులనే అజెండాలో పెడతామంటూ కమిషనర్ వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారుతోంది. తాను సూచించిన పనులున్న రఫ్ అజెండాపైనే సంతకం చేయాలంటూ చైర్‌పర్సన్‌కు కమిషనర్ అల్టిమేటం ఇవ్వడంపై పాలకవర్గం మండిపడుతోంది. కూటమి నేతలు సూచించిన పనులకు పాలకవర్గం ససేమిరా అనడంతో, ఏకంగా గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం లేకుండా చేసేశారు అధికారులు.

కౌన్సిల్‌తో సంబంధం లేకుండా..

ప్రతి నెలా విధిగా కౌన్సిల్ సమావేశం నిర్వహించాల్సి ఉంది. దీనిలో భాగంగా కౌన్సిల్ పరిధిలో నిర్వహించాల్సిన పనులకు సంబంధించి అజెండా రూపొందించి రఫ్ అజెండాను ముందుగా చైర్‌పర్సన్‌కు పంపుతారు అధికారులు. దానిని పరిశీలించి తన సమ్మతి తెలపాల్సి ఉంటుంది. ఇదే పద్ధతి ఎప్పట్నుంచో అన్ని మున్సిపాలిటీల్లో కొనసాగుతుంది. ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గొల్లప్రోలు నగర పంచాయతీ అభివృద్ధికి రూ.కోటి నిధులు కేటాయించారు. ఆ నిధులతో 27 అభివృద్ధి పనులు ఆయన సూచించారని కమిషనర్ కనకారావు టేబుల్ అజెండాను మే నెల కౌన్సిల్ ముందుకు తెచ్చేందుకు ప్రయత్నించారు. తమతో సంబంధం లేకుండా అజెండా ఎలా రూపొందించారంటూ చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు కమిషనర్‌ను ప్రశ్నించారు. ఆయన తీరుకు మండిపడుతూ టేబుల్ అజెండాపై సంతకం చేయడానికి నిరాకరించారు. దీంతో కమిషనర్ కనకారావు తన సంతకంతో టేబుల్ అజెండాను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టడంతో, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు గంటా అప్పలస్వామి, గంధ్రేటి శ్రీరామచంద్రమూర్తి తదితరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమాచారం లేకుండా..

అసలు ఏ పనులు పెట్టారు? ఎక్కడ పెట్టారనే విషయాలు కౌన్సిల్ సభ్యులకు ఎటువంటి సమాచారం లేకుండా, కేవలం ఉప ముఖ్యమంత్రి సూచించారంటూ పనులు నిర్ణయించి, ఏకంగా చైర్‌పర్సన్‌కు కూడా సమాచారం లేకుండా, ఆమె వ్యతిరేకించినా పట్టించుకోకుండా అజెండాను ఎలా ప్రవేశ పెడతారంటూ సమావేశంలో కమిషనర్ తీరుపై సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం నిధులిచ్చినా వాటిని సంబంధిత కౌన్సిల్ సభ్యుల అనుమతితో, వారి ఆమోదంతో మాత్రమే పనులు నిర్వహించాలన్న కనీస పరిజ్ఞానం లేకుండా కమిషనర్ తానే రాజకీయ నాయకుడిగా, అధికార పార్టీకి వంత పాడుతూ కౌన్సిల్‌ను అవమానిస్తున్నారని సభ్యులు ఆరోపించారు.

అవే పనులతో అజెండా

ఈ నెల నిర్వహించాల్సిన కౌన్సిల్ సమావేశానికి మళ్లీ అవే పనులను పెట్టి అజెండాను పంపించడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన చైర్‌పర్సన్ గంధ్రేటి మంగతాయారు కౌన్సిల్ సభ్యులు ప్రతిపాదించిన పనులు కూడా పెట్టాల్సిందిగా కోరారు. అవేమీ పట్టించుకోని కమిషనర్ తాను కూటమి నేతలు సూచించిన పనులే పెడతానని, కౌన్సిల్ సభ్యులు సూచించిన పనులు పెట్టేది లేదంటూ నిక్కచ్చిగా చెప్పి మరీ ఈ నెల సమావేశం లేకుండా చేశారని కౌన్సిల్ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆయన అనుకున్నదే తప్ప పాలకవర్గం మాట అసలు పట్టించుకోడం లేదని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

హక్కులను కాలరాస్తున్నారు

గత రెండు నెలలుగా కూటమి నేతలు సూచించిన పనులు తప్ప కౌన్సిలర్లు సూచించిన పనులు అజెండాలోకి తీసుకురావడం లేదని చైర్ పర్సన్ గంధ్రేటి మంగతాయారు ఆరోపించారు. ఇంకా అధికారంలో ఉండగానే.. తమకు ఎటువంటి అధికారం లేనట్లు అధికారులు వ్యవహరించడం తమ హక్కులను కాలరాయడమేనని ఆమె కమిషనర్ తీరును ఖండించారు. ఎవరు నిధులు ఇచ్చినా, ఎవ రు సూచించిన పనులు పెట్టుకున్నా ముందు పదవిలో ఉన్న కౌన్సిల్ సభ్యులు సూచించిన పనులకు ప్రాధాన్యమివ్వాలనేదే తమ వాదన అన్నారు. పాలకవర్గానికి ప్రాధాన్యం లేకుండా చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇలాఉండగా, తాను ఈ నెల 27నే రఫ్ అజెండాను చైర్‌పర్సన్‌కు పంపించానని, ఆమె దానిని తిరిగి పంపలేదని కమిషనర్ కనకారావు చెబుతున్నారు.

ఆర్‌బీకేను రక్షించాలని కలెక్టర్‌కు వినతి

సామర్లకోట: మండలంలోని పీబీ దేవం రైతు భరోసా కేంద్రం-1కు రక్షణ కల్పించాలని ఎంపీటీసీ సభ్యుడు మలకల సూర్యారావు సోమవారం కాకినాడలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, రైతులకు ఉపయోగపడాల్సిన రైతు భరోసా కేంద్రాన్ని ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన వ్యవసాయ కూలీలకు అద్దెకు ఇచ్చారని తెలిపారు. రైతు భరోసా కేంద్రం రైతులకు ఉపయోగపడే విధంగా చూడాలన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టరు స్పందించి, వెంటనే రైతు భరోసా కేంద్రంలో ఉన్న కూలీలను ఖాళీ చేయించి తనకు ఫొటో పెట్టాలని ఆదేశించారన్నారు. అదే విధంగా గోకులం మంజూరులో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని కలెక్టర్‌కు మరో వినతిపత్రం అందజేసినట్టు తెలిపారు. అలాగే గ్రామంలోని పీడబ్ల్యూడీ గట్టు పక్కన నిర్మించిన గోకులం షెడ్‌ను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల సీఎంఆర్ సొమ్ము వెంటనే ఇవ్వాలి



ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆర్డీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ నేతల నిరసన

పెద్దాపురం: మూడు నెలలు కావస్తున్నా ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన సీఎంఆర్ సొమ్ము చెల్లించలేదని, సత్వరమే రైతులకు సొమ్ము విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం పార్టీ రైతు విభాగం జిల్లా నాయకులు మోరంపూడి శ్రీరంగనాయకులు, ఇనకొండ వీరవిష్ణుచక్రం, గోపు మురళి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పండించిన ధాన్యానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ ఇవ్వకపోతే, రైతులు మళ్లీ వ్యవసాయ సీజన్‌కు ఎలా సిద్ధమవుతారని ప్రశ్నించారు. చేతికి అందిన పంటకు ప్రభుత్వం సొమ్ము ఇవ్వకుంటే, రైతులు పెట్టుబడులు పెట్టి మళ్లీ ఎలా వ్యవసాయ పనులు చేపడతారన్నారు. సత్వరమే సీఎంఆర్ సొమ్ము విడుదల చేయాలని, లేకుంటే వారం రోజుల తర్వాత రైతుల పక్షాన తీవ్ర ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నల్లల గోవిందు, నాగబోయిన రాజుబాబు, ఆకుల వీరబాబు, ఒబిలిశెట్టి అబ్బాయి, గోలి రామారావు, పెంటా విజయ్‌కుమార్, పల్లా గంగరావు, మేడిద వెంకట రామారావు, రంగనాథం శ్రీనివాస్, జీను రమణ, కూనపురెడ్డి స్వామి, గోపు నాగు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, మద్యం నియంత్రించాలి

- అశ్లీల నృత్యాలకు అనుమతి వద్దు
- ఆర్డీఓకు సీపీఎం నేతల వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన మరిడమ్మ జాతర నేపథ్యంలో పట్టణంలో గంజాయి, మద్యం నియంత్రణకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, గడిగట్ల సత్తిబాబు తదితరులు ఆర్డీఓ శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎంతో ప్రసిద్ధి చెందిన జాతర ఉత్సవాలను అభాసుపాలు చేసేలా అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేయడం తగదన్నారు. దీనికి ఎటువంటి అనుమతులు మంజూరు చేయరాదని కోరారు. మద్యం, గంజాయి మత్తులో యువత సృష్టిస్తున్న అల్లర్ల వల్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. వీధి సంబరం నిర్వహించే చోట సమీపంలో ఉన్న మద్యం దుకాణాన్ని మధ్యాహ్నం నుంచి మూయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి విక్రయదారులను తక్షణం అరెస్టు చేయాలని కోరారు. దూర ప్రాంతాల నుంచి అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దారపురెడ్డి కృష్ణ, కూనిరెడ్డి అప్పన్న, సిరిపురపు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి అంతా ఇల్లింద్రాడలోనేనా..?



పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ సూర్యావతి

అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు

పిఠాపురం: రూ.వందల కోట్లు మంజూరయ్యాయని, ఎక్కడా లేని అభివృద్ధి ఇక్కడ చేసేస్తున్నామంటున్నారు కానీ, ఇక్కడేమీ కనిపించడం లేదని కౌన్సిలర్ బోను దేవ అధికారులను ప్రశ్నించారు. అభివృద్ధి అంతా ఉప ముఖ్యమంత్రి స్థలాలు కొన్న ఇల్లింద్రాడ పరిధిలోనే జరుగుతోందని, గొల్లప్రోలు వైపే అధికారులు చూస్తున్నారని, పిఠాపురాన్ని పట్టించుకోవడం మానేశారని అధికారుల తీరును దుయ్యబట్టారు. పట్టణంలో నెలకొన్న అధ్వాన పారిశుధ్యంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారుల తీరు మారడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు అధికారుల తీరును దుయ్యబట్టారు. ఎక్కడ చెత్త అక్కడే ఉంటోందని ఏడో వార్డు కౌన్సిలర్ బోను దేవా ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డుల్లో వర్కర్లను పక్క వార్డుల్లోకి మార్చడం ఎందుకని, కనీసం వార్డుల్లో బ్లీచింగ్ చల్లి ఆరు నెలలైందన్నారు. అసలే వర్షాకాలమని, పారిశుధ్య నిర్వహణ ఇలా కొనసాగితే ప్రజలు రోగాల బారిన పడడం ఖాయమని రెండో వార్డు కౌన్సిలర్ ఎస్.లలిత ఆవేదన వ్యక్తం చేశారు. వీధుల వెంబడి చెత్తను వెదజల్లేందుకు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారా, చెత్తను తరలించేందుకు వినియోగిస్తున్నారా అంటూ పదో వార్డు కౌన్సిలర్ అల్లవరపు నగేష్ ప్రశ్నించారు. చెత్త ట్రాక్టర్ల పనితీరు అధ్వానంగా ఉందని కౌన్సిలర్ చెల్లూరు లోవరాజు అన్నారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ, పలు వార్డుల్లో శానిటేషన్ సరిగ్గా జరగటం లేదని, అధికారులు నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కావట్లేదన్నారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో 13 అంశాలు చర్చకు రాగా, 3 అంశాలను వాయిదా వేసి, పది అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు



స్వర్ణకుమారిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపల్లి: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది, వారి ఉన్నతికి, భవితకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని విశ్రాంత మండల విద్యాశాఖాధికారి కోటి అబ్బులు అన్నారు. ఉప్పాడ ఎంపీపీ నంబర్-1 పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన యండావు స్వర్ణకుమారిని సోమవారం ఇన్‌చార్జి హెచ్‌ఎం కేఎస్ఆర్ నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అబ్బులు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల వద్ద పాఠాలు నేర్చుకున్న విద్యార్థులు పారిశ్రామికవేత్తలై, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి, రాజకీయ నాయకులై.. మాస్టారూ అని పలకరిస్తే ఆ ఆనందం చెప్పలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సారా రహిత గ్రామంగా ఉండూరు

ఎక్సైజ్ సీఐ రామమోహనరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ రామమోహనరావు

సామర్లకోట: మండలంలోని ఉండూరు గ్రామాన్ని సారా రహిత గ్రామంగా ప్రకటించినట్లు ఎక్సైజ్ సీఐ కె.రామమోహనరావు తెలిపారు. సోమవారం సాయంత్రం ఉండూరు పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గతంలో గ్రామంలో కొన్ని కుటుంబాలకు చెందిన వారు సారా తయారు చేసి, విక్రయాలు జరిపేవారన్నారు. వారిపై తరచూ దాడులు చేయడం, కేసులు నమోదు కావడంతో వారు సారా తయారీకి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారన్నారు. సారా తయారు చేసే కుటుంబాలకు జీవనోపాధి కల్పించడంతో వారు వివిధ వ్యాపారాలు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ మేరకు సచివాలయ సిబ్బంది, గ్రామ నాయకుల సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బుల్లియ్యకాపు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మంచి మానవ సంబంధాలు కలిగి ఉండాలి



రామచంద్రరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

సామర్లకోట: ఉద్యోగులు పరస్పరం మంచి మానవ సంబంధాలు కలిగి ఉండాలని, ఈర్ష్య, ద్వేషం, కోపం వల్ల ఆరోగ్యానికి నష్టం జరుగుతుందని విస్తరణ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ కెఎన్‌వీ ప్రసాదరావు అన్నారు. ఉద్యోగాన్ని బాధ్యతగా, అంకిత భావంతో పని చేసిన వ్యక్తి కర్రి రామచంద్రరావు అని కొనియాడారు. 31 ఏళ్ల పాటు కార్యాలయ కారు డ్రైవరుగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఈటీసీలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. రామచంద్రరావు లాంటి వ్యక్తి ఉద్యోగ విరమణ చేయడం కార్యాలయానికి లోటేనన్నారు. ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, బంధువులు, స్నేహితులు కలిసి రామచంద్రరావును సత్కరించారు. కార్యక్రమంలో ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, డ్వామా ఏపీడీ ఎం భానుప్రకాష్, ఫ్యాకల్టీలు కె.సుశీల, ఎస్ఎస్ శర్మ, ఎ.రవిశంకర్, బి.ఆంజనేయులు, చక్రపాణిరావు, రీసోర్స్‌పర్సన్ కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: పట్టణంలోని పంచారామ క్షేత్రంలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి ప్రీతైన రోజు ఆషాఢ మాసం పంచమి కావడంతో ఆలయంలోని స్వామి, అమ్మవార్లకు, ఉపాలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలో వేచి ఉన్నారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణిలోని నీటితో అభిషేకాలు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం, శనగలు, పులిహోర ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్ శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. స్థానిక మఠం సెంటర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయంలోను, గొంచాలలోని శివాలయంలోను, పీబీ దేవం శివాలయంలోను పూజలు నిర్వహించారు.

9న దేశవ్యాప్త సమ్మె

పిఠాపురం: సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జూలై 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సంఘ జిల్లా అధ్యక్షుడు డి.శేషు బాబ్జీ పిలుపునిచ్చారు. స్థానిక నందూరి ప్రసాద్‌రావు భవనంలో సీఐటీయూ అనుబంధ సంఘాల సమావేశం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథి శేషు బాబ్జీ మాట్లాడుతూ, దేశంలో నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా చేశారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలమైన చట్టాలు తీసుకువచ్చిందన్నారు. అసలే యువతకు ఉద్యోగాలు దొరక్క, రోజువారీ కూలీ పనులకు వెళుతుంటే, వారికి ఉపాధి కల్పించకుండా, ఉన్న పరిశ్రమలను ప్రైవేటుపరం చేస్తూ పేద కార్మికులపై అప్పుల భారాలను మోపుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.చిన్నా విశ్వనాథం, జి.వీరబాబు, రామన్నరాజు, పప్పుల, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.